# తులశమ్మగారు

మా బావమరిది శివానందం, ఎరుగుదురో లేదో, చాలా పేరు ప్రఖ్యాతులు గల సంఘ సంస్కర్త. వాడు 'సాంఘిక దురాచారములు – స్త్రీలు' అనే శీర్షికతో అనేక వ్యాసాలు రాశాడు. వీలుపడినప్పుడు ఉపన్యాసాలు కూడా యిచ్చాడు. మనవంటి పామరులకు అయోమయంగా వుండి తలాతోకా తెలియని "స్త్రీ విద్య", "స్త్రీ స్వాతంత్ర్యం" మొదలయిన విషయాలు వాడికి కరతలామలకాలు. ఈ విషయంలో దేన్ని గురించి అయినా సరే ఒక్క నిమిషం వాడు మాట్లాడగా విన్నవాడికి వాడియొక్కగొప్పతనం స్పష్టంగా తెలిసిపోవలసిందే. నేను ఫలానివాడి చెల్లెలి భర్తను అని తెలిసినమీద నన్నెంతమందో అధికంగా గౌరవించటం కూడా జరిగింది.

అయితే మా శివానందాన్నీ వాడి ఉపన్యాస ధోరణినీ తూస్కారించేవాళ్ళు కొందరు లేకపోలేదు. వాణ్ణి చిన్నతనం నించీ బాగా ఎరిగినవాళ్ళూ, వాడి ఆప్త బంధువర్గమూ ఇందులో (నన్ను కూడా కలపండి) వాడియందు ఎక్కువ గౌరవము కలిగి ఉండకపోగా, వాణ్ని కొంచెం నిరసనతో చూసేవారు కూడాను! వాడికొక స్నేహితుడు "సెర్చ్‌లైట్" అని నామకరణం చేశాడు. దగ్గిరనుంచి కంటే దూరాన్నించి ఎక్కువ కాంతివంతుడుగా కనిపిస్తాడనే అర్థంలో. ఈ నూతన నామాన్ని మా శివానందం చాలా కాలంపాటు మరొక అర్థంలో తీసుకొన్నాడు – గాఢ తమస్సులో అమితమైన జ్ఞాన ప్రకాశం కలగచేసేవాడని! ఆ పేరు వాడికి కొద్ది కాలంలోనే స్థిరపడి పోయింది.

హిట్లరు, ముసోలినీ, చార్లీ చాప్లిన్, రామ్సే మాక్డొనాల్డు మొదలైన గొప్ప వాళ్ళను తీసుకోండి. వాళ్ళందరికీ దగ్గిర వాళ్ళు ఉండి తీరుతారు – "ఏడిచావులే! నీ మొగంలే!" అని అనగలవాళ్ళు. వాళ్ళను కూడా మన మాదిరిగానే ఈ అంతర్జాతీయ వ్యక్తులను నోరు తెరుచుకు చూడమంటే చూడరు సహజంగా. అతి పరిచయం గౌరవహాని హేతువు. ఇదే మా శివానందానికి వర్తిస్తుంది మరి. కాని వాడిదగ్గిర వాళ్ళమంతా వాణ్ని చూస్తే మూర్ఛపోవటానికి ఇది ఒకటే కారణం కాదు. ఇతర కారణాలున్నై....

కారణాంతరాల వల్ల నేను జరిగిపోయిన విభవనామ సంవత్సరం యావత్తు బెజవాడలో గడపవలసి వచ్చింది. గవర్నరు పేటలో శ్రీనివాసశాస్త్రి గారి డాబాలో ఉత్తరపు

వైపు భాగం చాలా చవుకగా దొరికింది. అది మాట్లాడుకుని వెంటనే నా భార్యను తీసుకువచ్చి అందులో ప్రవేశించాను.

శ్రీనివాస శాస్త్రిగారు చాలా పెద్దమనిషి. మాకు ఎంతో ఆప్తుడల్లే ఉండేవాడు. మమ్మల్నిద్దర్నీ ఆయన తన మూడో తరం వాళ్ళను చూసినట్టు చూసేవాడు. మాకూ ఆయన దగ్గిర చనువు తీసుకుని మాట్లాడటానికి పట్టిచ్చేది కాదు.

"ఏమండీ, బాబుగారూ! ఇల్లయితే చాలా బాగుంది కాని, బయట ఉన్నప్పుడు కొంచెం ఇబ్బందండీ! బయట వరండాలో కూర్చోవాలి. పొద్దుటి పూట ఎండ. అవతలి భాగం ప్రస్తుతం ఖాళీగా ఉంది గాని, లేకపోతే మధ్యతడిక పెడితేగాని - వచ్చేవాళ్ళు పొయ్యేవాళ్ళూ - అసలు వరండాలో కూర్చోటమే కష్టం" అన్నది నా భార్య ఒకసారి శాస్త్రిగారితో.

ఆయన నవ్వుతూ, "వాడుకోవమ్మా, అవతల భాగం యావత్తూ నీదే! ఇప్పుడప్పుడే అందులో ఎవరూ ప్రవేశించరు. మా మేనల్లుడొకడు ప్రాక్టీసు పెట్టబోతున్నాడు, వచ్చే సంవత్సరం నుంచీ. వేసవికాలం కూడా ఇక్కడే గడుపుతాడేమో. ఈ మూడు నెలల భాగ్యానికి అద్దెకివ్వటం ఎందుకని ఉంచేశాను" అన్నాడు. ఇంతకూ నా భార్య బయట ఉండనే లేదు. శాస్త్రిగారి మేనల్లుడు ఖాయిలాపడి వేసవికాలం బెజవాడలో గడపటానికి రానూలేదు.

"బెజవాడ ఎండలకు పిల్ల నలిగిపోతుంది!" అని మా మామగారు నా భార్యను అయిదో నెల గర్భిణిగా ఉండగానే తీసుకుపోయినాడు. "వళ్ళు జాగర్తగా కాపాడుకోండి!" అని నాకు గంభీరంగా సలహాయిచ్చి నా భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది తండ్రివెంట.

వేసవికాలం వెళ్ళిపోయింది. ఇంటికంతకూ నేను ఒక్కణ్నే. నాకీ ఏర్పాటు బాగానే ఉంది. నేను సామాన్యంగా ఎవరితో పడితే వాళ్ళతో స్వేచ్ఛగా మాట్లాడగలవాణ్ని కాను. ఆ చాకచక్యం మా బావమరిది శివానందం దగ్గిర ఉంది. నా మటుకు నాకు ఒంటరిగా ఉండటమే బాగుంది. ఇంతలో మా యిల్లుదారు శ్రీనివాసశాస్త్రిగారు వచ్చి దక్షిణపువేపు భాగంలో ఎవరో ప్రవేశించబోతున్నారని చెప్పాడు. నా కెందుకో చాలా కష్టం వేసింది. వివరాలడిగి కనుక్కున్నాను.

ఆ భాగంలో ప్రవేశించబోతున్న పెద్దమనిషిగారి పేరు రామదాసుగారుట. ఆయనా, ఆయన భార్యా, ఇద్దరాడపిల్లలూనట. ఆయన బెజవాడలో కొత్తగా ప్రాక్టీసు ప్రారంభించబోతున్నాడుట. ఆయనకు పాతికేళ్ళ వయసుంటుందిట.

నాకు గుండెలో రాయి పడ్డది. సహం ఇల్లు మరొకరికి పోబోతున్నదనే దిగులుకంటె పెద్ద దిగులు నన్నిపుడు పట్టుకుంది.

ఇవతలి భాగంలో నేను తాత్కాలిక బ్రహ్మచారినీ, అవతల చిన్న వయసులో ఉన్న భార్యాభర్తలూ! నేను కూడా కాపరం చేస్తూ వుండినట్లయితే అంత చిక్కు లేకపొయ్యేది, ఎవరి మహాలోకంలో వారుండవచ్చును. ఇప్పుడా రామదాసుగారికి పెళ్ళాంతో స్వేచ్ఛగా మాట్లాడేటందుకయినా ఉంటుందా? సరసాలూ అవీ ఆడుకునేటందుకుంటుందా? ఆయన భార్యగారికి గొంతెత్తటానికయినా ఉంటుందా? నాకు నిజానికి వారేం చేస్తున్నారో పట్టదనే అనుకోండి. వారామాట అనుకోవద్దా? ఆయన కోర్టుకు వెళ్ళినప్పుడు ఆయన భార్యా ఒంటరిగత్తే – ఇద్దరాడపిల్లలున్నారనుకోండి; పసిపిల్లలు వాళ్ళెందులో జత అవుతారు? – ఇవతల నేను ఒంటరిగాణ్ని!

ఆ రామదాసు ఎన్నెన్ని విధాల నన్ను గురించి భావించుకోటానికి వీలున్నదో విచారించినకొద్దీ, ఆ భాగం వదిలిపెట్టి మరెక్కడికైనా పోదామని సంకల్పం దృఢమయింది. ఎంతగా ఆలోచించినా అంతకంటె గత్యంతరం లేనట్టు కనిపించింది.

అయితే నేను వెంటనే ఆ పని చెయ్యటానికి పెద్ద అంతరాయం ఒకటి వచ్చింది. మనకు బెజవాడలో సంపాదనా చట్టుబండలూ ఏమీలేదు. మా అన్న గారు ప్రతి ఒకటో తేదీకి కొంత పైకం మనియార్డరు చేస్తుంటాడు. దానితో కాలం వెళ్ళబుచ్చుతున్నాను. అయితే నాకీ రామదాసుగారు పక్క భాగంలో ప్రవేశిస్తారన్న వార్త జూలై పన్నెండవ తారీఖున తెలిసింది. అనగా పదిరోజుల నుంచీ నా చేతులో ఒక పైసా లేదన్నమాట. ఇప్పుడే ఇంట్లోనించి లేవటమంటే డబ్బుతో గూడిన పని. ఇవతల శాస్త్రిగారిని మొహమాట పరిచి అద్దె తరవాత ఇస్తానని లేవటమే కాక, అవతల మరొకర్ని మొహమాట పరిచి బయానా లేకుండా మరొక భాగంలో ప్రవేశించవలసి రావటం కూడా కాక, సామానులు తీసుకుపోవటానికి బండి ఖర్చుకు పావలో అర్ధో ఎవరి దగ్గరన్నా ముష్టి ఎత్తాలి! అనేక రకాల పదార్థాలను అప్పిచ్చే వాళ్ళను సంపాదించుకున్నానుగాని బండి బాడుగ అప్పుపెట్టే సాయిబును సంపాదించుకోవాలని నాకు తట్టక పోయింది. ఈ పరిస్థితుల్లో చేసేది ఏమీలేక నెలాఖరు వరకూ ప్రాణాలు బిగబట్టుకుని కూర్చోటానికి తీర్మానించుకున్నాను.

మర్నాడే రామదాసుగారు వచ్చి పక్క భాగంలో ప్రవేశించాడు. నేను ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకుని కాఫీ హోటలుకు బయలుదేరి వీధిలోకి వచ్చేసరికి వీధిలో మా ఇంటిముందు రెండు బళ్ళు నిలబడి ఉన్నై. ముందు బండిలోనించి ఒక ఇరవై సంవత్సరాల వయస్సుగల చామనఛాయ మనిషి చంటిపిల్లను భుజాన వేసుకుని దిగుతున్నది. ఒక నల్లటి పొట్టి మనిషీ, ఒక మూడేళ్ళ ఆడపిల్లా అంతకు పూర్వమే బండిలోనించి దిగి బండి పక్కన నిలుచుని ఉన్నారు. మూడేళ్ళ పిల్ల సంబరంతో ఏదో

బిగ్గరిగా అరుస్తున్నది. వెనక బండి నిండా సామానుంది. నేనీ దృశ్యం చూట్టం కట్టిపెట్టి గబగబా కాఫీ హోటలువేపు నడవసాగాను.

హోటలునించి తిరిగి ఇంటికి రాబుద్ధి పుట్టలేదు. అందుచేత అలవాటు లేకపోయినప్పటికీ పదీ పదిన్నర వరకు వాళ్ళ యిళ్ళకూ, వీళ్ళ యిళ్ళకూ వెళ్ళి, ఏదో బాతాఖానీ కొట్టి భోజనం వేళకు మళ్ళీ హోటలుకు వెళ్ళి భోజనం చేశాను. అప్పుడు కూడా కాళ్ళు యింటివేపు తిరగ నిరాకరించినై. ఇంటికి పోగూడదనే నా సంకల్పం చప్పబడటం మొదలుపెట్టింది. కొంచెంసేపు ఎటూ తేల్చుకోలేక పోయినాను. ఒక్కనాటికే ఇట్లా అయితే ఇరవై రోజులు నేనేం గడపగలను? ఎకాయెకీని లైబ్రరీకి వెళ్ళాను. అక్కడ కాలం ఎట్లా గడిచిపోయిందో తెలియదు. పుస్తకాల మధ్య సులభంగానే గడిచిపోయినట్టు కనపడింది. కాని దీపాలు పెట్టే వేళ లైబ్రరీలోనించి బయటికి వచ్చేటప్పటికి, ఇల్లు జ్ఞాపకం వచ్చేటప్పటికి, ఇంటి మొహం చూసి ఎన్నో యుగాలయినట్టుండి, లోపలినించి చెప్పరాని గుబులొకటి బయల్దేరింది. ఇంటికి వెళ్ళి – ఒక్కసారి ఇంటి మొహం చూచినట్టు కూడా అవుతుంది – స్నానం చేసి బట్టలు మార్చుకుని, ఊళ్ళోకి వెళ్ళి, వీలయితే ఎవడితోనన్నా సినిమా ప్రోగ్రాం వేసి, హోటల్లో మళ్ళీ భోజనం కానిచ్చుకుని, రెండో ఆటకు సినిమాకు వెళ్ళి, నిశిరాత్రి వేళకు కొంపకు చేరి, గుట్టుచప్పుడు కాకుండా పడుకుని నిద్రపోదామని కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాను.

నేను మా వరండాలోకి వచ్చి తలుపు తాళం తీస్తుండగా రామదాసుగారి హాల్లోనించి "అన్నగారూ!" అని ఆడ గొంతుతో పిలుపు వినబడ్డది. రామదాసు గారి భార్య కామాల్లనుకుంటూ, ఎవర్ని పిలుస్తున్నదా అని ఆశ్చర్యపడుతూ, తలుపు తాళం తీసి, పెద్ద చప్పుడుతో తలుపులు లోపలికి తోసి లోపలికి పోబోతుండగా, చంటిపిల్లను ఎత్తుకుని బండి దిగుతుండగా నేను పొద్దున చూసిన స్త్రీ – రామదాసు గారి భార్య – లోపలినించి బయటికి వరండాలో వచ్చి నవ్వుతూ "మిమ్మల్నేనండీ, అన్నగారూ! పలకరేం?" అంది. అప్పటికి కూడా ఆమె పలకరిస్తున్నది నన్ను కాదని నమ్మజూచాను కాని అసాధ్యమయింది.

నేను తడువుకుంటూ, "మీరు పిలవటం వినలేదు, నన్ను కాదనుకున్నాను" అని పిచ్చిగా సమాధానం చెప్పాను.

"మీ దగ్గిర నిప్పెట్టె వుంటే ఒకసారి ఇస్తారూ? మా నిప్పెట్టె సామానులో ఎక్కడ పడిపోయిందో, ఎంత వెతికినా కనిపించదు" అన్నదామె.

"ఒక్క క్షణం ఆగండి. పెట్టెలో ఉంటుంది నా నిప్పెట్టె. వెతికి యిస్తాను!" అని లోపలికి వెళ్ళి ఆమెకు నిప్పెట్టె వెతికి తెచ్చి యిచ్చాను.

ఆ విధంగా ప్రారంభమయింది నాకు తులశమ్మగారితో పరిచయం. ఆవిడ వంటి

ఆడదాన్ని నేనెక్కడా చూడలేదు. ఆమెతో పరిచయం లేక పూర్వం అటువంటి మనిషి ఉందని ఎవరైనా చెబితే నేను నమ్మగలిగి ఉండేవాణ్ని కాను. ఆమెకు స్త్రీ పురుష విచక్షణ అనేది ఉన్నట్టే ఉండేది కాదు. మొహం ఎరగని మగవాళ్ళతో కలుపుగోలు తనంగా మాట్లాడే వాళ్ళు సామాన్యంగా రెండు రకాలుగా ఉంటారు. ఒక రకం సంఘం చేత గర్హించబడేరకం. రెండవ రకం అమిత గడుసైన ఆడది. తులశమ్మగారు మూడో రకం మనిషి. ఆమె అమిత సాధువు. ఆమె ఎవరితోనూ ఏ విషయాన్ని గురించీ వాదనలోకి దిగదు. అందరితోనూ ప్రతి విషయంలోనూ ఏకీభవించే మనిషి. కొంతమంది ఆడవాళ్ళకు ఒక ప్రజ్ఞ ఉంది. వాళ్ళు తమ మొగుళ్ళను నెత్తిమీద పెట్టుకుంటూ, ఇతర పురుషులు తమ మొగుళ్ళ కాలిగోరికి పోలరన్నట్టూ, తమకు పొద్దస్తమానమూ మొగుళ్ళను గురించిన ధ్యాసే తప్ప, మరొక ధ్యాస లేనట్టూ స్పష్టంగా లోకానికి తెలియచేస్తారు. తులశమ్మగారు అటువంటిది కాదు. లోకంలో ఉన్న మనుష్యులలో మొగుడు కూడా ఒకడన్నట్టుండేది. ఎవరన్నా నా బోటివాడు వాళ్ళింటో పది సంవత్సరాలున్నప్పటికీ, ఒక్కసారయినా, ఎంత స్వల్ప విషయానికి గానీ, ఆమె మొగుడి విషయంలో పక్షపాత బుద్ధి కనపరిచిందని అనుకోలేడని నా నమ్మకం. కాని ఆమెకు మొగుడి మీద ఎంతో అభిమానం ఉందని నేను తెలుసుకున్నాను.

రామదాసు గారు చాలా విచిత్రమైన మనిషే. ఆయనకు అసూయ అనేది ఏ కోశానా ఉన్నట్టు కనబడదు. భార్యను గౌరవించేవాడు. వాళ్ళిద్దరూ ఎన్నడూ కొంచెంగానైనా ఘర్షణ పడేవాళ్ళు కారు. ఆయన చాలా మితభాషి. ఇంట్లో కూడా అట్లాగే ఉండేవాడు. పిల్లను కూడా వాళ్ళు తమతో సమానంగా చూసే వాళ్ళు, తల్లిదండ్రులు. ఆ అమ్మాయి అందరితోనూ సమానస్తురాలల్లేనే మాట్లాడేది. పెద్ద చదువులెందుకు, నాగరికత లెందుకు? ఏ యింట భయమూ, క్రోధమూ, అసూయా అడుగుపెట్టలేవో ఆ యిల్లు స్వర్గంతో సమానం కాదా?

రామదాసుగారో, లేకపోతే తులశమ్మగారో నన్ను దాదాపు ప్రతిరోజూ ఆతిథ్యానికి పిలుస్తూనే ఉండేవారు తమ యింటికి. నేను పెడసరితనం చేసి ఎక్కువసార్లు తప్పించుకుపోయినప్పటికీ అయిదారుసార్లు తప్పనిసరిగా వారింట భోజనం చెయ్యవలసి వచ్చేది.

ఒకటో తారీకొచ్చింది. మా అన్నగారు డబ్బుపంపాడు. నేను ఇల్లు మార్చే విషయం పూర్తిగా మరిచిపోయినాను.

ఈ పరిస్థితుల్లో శివానందం వచ్చి మా కొంపలో తిష్ట వేశాడు. వాడు కొంపలో అడుగుపెట్టిన క్షణం నుంచీ నా మనస్సెందుకో పరిపరివిధాల పోవటం మొదలుపెట్టింది.

"వీడేదో వెధవ పని చెయ్యకుండా ఇక్కడనించి పోడు!" అని నాకు అప్పుడే అనుమానం కలిగింది.

ఎందుకంటే మా వాడి సంగతి నేనెరుగనూ? వాడి బుద్ధి స్త్రీని గురించి మననం చేసి చేసి తన్మయత్వం పొందింది. వాడి కళ్ళకు ప్రతి ఆడదీ మగపశువుల వాతబడిన ఒక సుకుమారమైన పుష్పం. ఆడదాని దర్శనమే వాడి హృదయాన్ని కలచివేస్తుంది. ఈ వెధవ, తులశమ్మగారిని చూసి ఒక నిట్టూర్పు విడిస్తే?....

పైగా ఆవిడ నాతో చనువుగా మాట్లాడటం చూసి వీడు ఏమీ అనుకోకుండా ఊరుకుంటాడా? "మా వాడు ఇక్కడ ఉన్న నాలుగు రోజులూ నన్ను పలకరించవద్దు" అని నేనామెను వేడుకోటం భావ్యంగా ఉంటుందా? నన్ను పలకరించినట్టుగానే ఆమె వాణ్ణి కూడా చనువుగా పలకరిస్తే మోటవాడూ – మొగలి పువ్వూ సామెత అవుతుందేమో! తులశమ్మగారు ఈ కొత్త పద్ధతి ఒకటి ఎందుకు ప్రారంభించిందా అనిపించింది. ఆమె స్త్రీ పురుష విచక్షణ చెయ్యకపోవటం అకస్మాత్తుగా నాకు అరుచికరం కావటం మొదలుపెట్టింది. అందరాడవాళ్ళకు మల్లేనే తులశమ్మగారు కూడా మగ ముండాకొడుకులను తప్పించుకు తిరగరాదా అనిపించింది. మా సంఘసంస్కర్త ఏవైనా తప్పుడు వేషాలకు దిగితే ఏం చెయ్యాలో ఆమె చూసుకోగలదనే ఆలోచనే నాకు తట్టలేదు. వీడేదన్నా వళ్ళు మరిచి ప్రవర్తిస్తే ఆవిడ పెద్ద పెట్టున అరిచి, మూర్ఛపోయి, చివరకు "తప్పంతా నీదే!" అని అంటుందేమోనని నాకు ఒక అస్పష్టమైన భయం! అటువంటి వాటికి నన్ను బాధ్యుణ్ణి చెయ్యదని నాకు తట్టలేదు.

నేను అనుకున్నంతా అయింది. అంటే మా శివానందం వచ్చి ఒక అరగంట అయినా అయిందో లేదో తులశమ్మగారు "ఏమండీ, అన్నగారూ!" అంటూ మా భాగంలోకి వచ్చి మా వాణ్ణి చూడగానే, "ఈ అన్నగారెవరు?" అంది. మా శివానందం ఆమె వంక వర్ణనాతీతమైన వెధవ మొహం ఒకటివేసి చూడటం మొదలుపెట్టాడు.

నేనూ బలవంతాన చేసిన పాపం చెప్పుకుంటున్నవాడల్లే "మా బావమరిది" అన్నాను. ఆ పైన తులశమ్మ పెద్ద ఆప్తుణ్ణి చూసినదానల్లే వాడితో సంభాషణ పెట్టుకుని, వాడి పుట్టుపూర్వోత్తరాలన్నీ విచారించి, నా భార్య కులాసాగా తిరుగుతున్న సంగతి కనుక్కుని, ఆ రాత్రికి మమ్మల్నిద్దరినీ తమ యింటికి భోజనానికి ఆహ్వానించింది. నేను ఒక చెంప ఎందుకు లెమ్మంటుంటేనే, మా వాడు సరేనని వాగ్దానం చేశాడు.

ఆమె వెళ్ళగానే మా శివానందం మెరుస్తున్న కళ్ళు నా మీదికి తిప్పినన్ను ఆపాదమస్తకమూ పరీక్షిస్తూ, చిన్న గొంతుతో, "రకంవారీగానే ఉందే! ... మంచి ఏర్పాటే చేసుకున్నావు! అంతేలే, ఏమిటి లేకపోతే?.... వెధవ బ్రహ్మచర్యం!" అన్నాడు.

"చాల్లే! అంతటితో కట్టిపెట్టు!" అన్నాను.

"దాం దుంపతెగా! కాస్త సోషల్ రిఫార్మరని కూడా ఆవిడకు నా విషయం తెలియజేస్తే అరిగి పోతావా!" అన్నాడు వాడు నా మాటలు వినిపించుకోకుండా.

"నాకు తెలిసివుంటే ఆ మాట తప్పకుండా చెప్పే ఉందును" అన్నాను.

మొదటినాడు తులశమ్మను చూసి నిశ్చేష్టుడయిన శివానందం, రెండో నాడు రసికుడయినాడు. ఏవో మర్మ వాక్యాలు మాటాడుతున్నానని భ్రమ పడుతూ వెర్రివాగుడు చాలా వాగాడు. వాగుతున్నంతసేపూ భయంకరంగా చిరునవ్వు నవ్వుతూనే ఉన్నాడు. తులశమ్మగారు ఏమనుకుంటుందో అని నేను భయపడుతూనే ఉన్నాను. ఆమె నన్ను ఒంటరిగా పిలిచి "మీ బావమరిదికి చిత్త చాంచల్యం ఉందా?" అని అడిగింది.

ఆ రోజు రాత్రి మావాడితో ఆవిడ అన్న ముక్క చెప్పాను. అది విని మావాడు పొందిన పరమానందానికి మేరలేదు. కేసు యావత్తూ అయోమయంగా ఉన్న స్థితిలో ఒక చిన్న విషయం తెలియగానే షెర్లాక్ హోమ్సు, 'దిక్లూ!' అంటూ అట్లాగే కుర్చీలోనించి, మత్తులోనించి లేచి గదంతా నృత్యం చేసి ఉంటాడు. మావాడి సంతోషం నాకేమీ అర్థం కాలేదు. తరిచి తరిచి అడగ్గా, చాలాసేపు, "ఉందిలే! ఉందిలే!" అని చివరకు తెలియచేశాడు – ఆమె ఆ మాట అనటం తనమీద మనస్సు పడ్డదని తెలియచెయ్యటం అని. ఈ శుభవార్త నా చేతనే చెప్పించటంలో ఆమె తన అమితమైన నేర్పరితనాన్ని ప్రకటించిందట. నిజంగా మతిపోయిన వాడు తప్ప అట్లా అనుకోడు కనక, నేను మావాడికి తులశమ్మగారన్నట్టు, మతిపోయిందేమోనని అనుకున్నాను.

వచ్చిన మూడోనాడు శివానందం పప్పులో కాలువేశాడు. నేను నిద్రపోతున్నాను. అవతల రామదాసుగారు లేదు. మధ్యాహ్నం మూడు గంటలప్పుడు మావాడు చల్లగా ఆవలి భాగంలోకి వెళ్ళి ఆమె సావిట్లో బియ్యం బాగుచేసుకుంటుంటే, ఆమెకు కాస్తా తన వాంఛ ఎరిగించుకున్నాడు. తులశమ్మ సమర్థురాలు. మావాడ్ని తల వాచేటట్టు చివాట్లు పెట్టటం మొదలుపెట్టింది.

ఆమె గొంతు విని నేను లేచి వెళ్ళాను. ఒక్క క్షణంలో నాకంతా అర్థమైంది. తులశమ్మగారు జరిగిందంతా నాకు చెప్పేసిన తరువాత నా కావిడ మీద కోపం పోయింది. (ఆడది మొగవాణ్ణి పట్టుకు జాడిస్తుంటే నేను సహించలేక పోయినాను. మంచి ఆడది సమర్థురాలు కూడా కావటం నేను ఊహించలేకపోయినాను, సహజంగా!)

మా బావమరిది ఆమెను అడగగానే ఆమె మర్యాదగా, "నువ్వు పొరబాటు పడ్డావు. నాయనా! నేను అటువంటి దాన్ని కాను!" అన్నదిట. అంటే మా వెధవ, "నీకు మా వాడు

నచ్చినంత మాత్రం నేను నచ్చకపోయినానా?" అని ఆమెను అడిగాట్ట. నేను వాణ్ని నా గదికి తీసుకువచ్చి నా వంతు కొన్ని వడ్డించి వేగిరం యింటిదారి పట్టమన్నాను.

"చాలా బాగా చెప్పావులే! నేను పొరపాటు పనే చేసి ఉండవచ్చును. అందుకని ఒక ఆడది ఒక మగపురుషుణ్ని పట్టుకుని అన్ని మాటలనగా నీ మగతనం ఏమైంది? చూస్తూ ఊరుకున్నావా?" అని దెప్పాడు నన్నువాడు.

"నీ సంఘ సంస్కరణ ఏమైంది? ఆడది తన విషయం తను చూచుకో లేక ప్రతి స్వల్ప విషయానికీ ఏ మొగుడి మీదనో ఆధారపడనా? అయితే రామదాసుగారు వచ్చేదాకా ఆగు. ఆయన చేతనే నీకు తగిన పరామర్శ చేయిస్తాను. అసలు నువ్వేం సంఘసంస్కర్తవురా? నీ ఆదర్శాలకు సరిపోయే ఆడమనిషి నీ వెధవ జన్మకు ఒకతె కనిపిస్తే. ఆ ఒకతెతో భోగందాన్ని అడగవలసిన మాట అడిగిన వాడివి!" అని వాణ్ని ఆరుగంటల బండికి ఆయత్తం చేశాను.

*మొదటి ముద్రణ : నిలవనీరు కథల సంపుటి, డిసెంబర్ 1944*
*యువ బుక్ డిపో, మద్రాస్*